జిల్లా దవాఖానలో కొనసాగుతున్న వైద్య పరీక్షలు

కొండాపూర్, ఫిబ్రవరి 19 : కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో కొవిడ్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు ప్రతి రోజు కొనసాగుతున్నాయని దవాఖాన సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లితో పాటు రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే వారికి అందుబాటులో ఉన్న వైద్య పరీక్షలను ప్రతి రోజు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం 770 జనరల్ ల్యాబ్ టెస్ట్‌లు చేయగా, 11 మందికి కొవిడ్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కాగా ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చందానగర్ ఈఈగా కేవీఎస్ రాజు

మియాపూర్, ఫిబ్రవరి 19: జీహెచ్ ఎంసీ చందానగర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా కేవీఎస్ రాజు నియామకమయ్యారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని అల్వాల్ సర్కిల్ ఈఈగా పని చేస్తున్న రాజు బదిలీపై చందానగర్ సర్కిల్‌కు వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడి సర్కిల్ ఈఈగా పని చేస్తున్న శ్రీకాంతిని అల్వాల్ సర్కిల్ ఈఈగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఈఈకి డీఈలు, ఏఈలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం పనుల్లో నాణ్యత.. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేలా కృషి చేస్తానని నూతన ఈఈ కేవీఎస్ రాజు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కృష్ణారావు జన్మదిన వేడుకలు

కేరళలోని చిట్టూరు పరమశివుడి ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ, నాయినేని తులసీరావు, రవీందర్‌రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 19 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం తన జన్మదినం సందర్భంగా కేరళ రాష్ట్రంలోని చిట్టూరు పరమశివుడి ఆలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు కేక్‌లు కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్‌లో కో-ఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ బాబూరావు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్‌చేసి మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అనాథాశ్రమంలో అన్నదానం, వృద్ధులకు పండ్ల పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ మహిళా మండలి భవనంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ నేతలు కేక్‌ను కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు ఉన్నారు.

అల్లాపూర్, ఫిబ్రవరి 19: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు అల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సబీహాబేగం ఆధ్వర్యంలో గాయత్రీనగర్ చంద్రాగార్డెన్స్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణలో భాగంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కార్పొరేటర్ కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు.

మూసాపేటలో..

మూసాపేట, ఫిబ్రవరి19: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు సోమవారం మూసాపేటలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సొంత నిధులతో అందిస్తున్న కుట్టు మిషన్లను జిల్లా గోపాల్, తూము నిఖిల్‌కుమార్ మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, వేణు, తుకారాం, పవన్, సత్యనారయణ, వీరచారి, రాము, నర్సింగ్, కాశీనాథ్, శ్యామల, మంగమ్మ, రమాదేవి, సుజాత, శాంత, పద్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ డివిజన్ పరిధిలో

అల్లాపూర్, ఫిబ్రవరి 19: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పుట్టిన రోజు సందర్భంగా బాలానగర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య భారీ కేక్ కట్ కట్ ఎమ్మెల్యే కు పుట్టిన రోజు శుభాంక్షలు తెలియజేశారు.

కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న కో-ఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్ శిరీషాబాబూరావు

కేపీహెచ్‌బీ కాలనీలో మహిళలకు కట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు

ఫతేనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పూర్తిచేసుకున్న 261 మంది మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

మూసాపేటలో మాధవరం కృష్ణారావుకు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

అభివృద్ధిని విస్మరించి.. కాలం గడుపుతున్నారు

మియాపూర్, ఫిబ్రవరి 19 : ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఎన్నికైన మూడు నెలల నుంచి అభివృద్ధిని పూర్తి స్థాయిలో విస్మరించిందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజా సమస్యలను పదిలేసి కాలం గడుపుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను, అభివృద్ధి పనులను కౌన్సిల్‌లో ప్రస్తావించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జోనల్‌కు ఐఏఎస్ అధికారులను కేటాయిస్తే సమస్యలు తీరుతాయని మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశించారని, నిధులు మంజూరు లేక అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గడచిన మూడు నెలలుగా పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులు ఇతర కనీస సమస్యలను సైతం ఏమాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 50 ఏండ్లు వెనుకబడ్డ నగరాన్ని కేవలం పదేండ్ల కాలంలో అభివృద్ధి పరుగులు పెట్టించామన్నారు. ఇప్పటికైనా గొప్పలు మాని ప్రజా సమస్యల పట్ల, అభివృద్ధి పట్ల ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చే లోగా అత్యవసర మరమ్మతులను పూర్తి చేయాలని కోరారు.

బల్దియా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు..

దుండిగల్, ఫిబ్రవరి 19: ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును సోమవారం పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పలువురు బీఆర్ఎస్ నేతలు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ..

గాజులరామారం డివిజన్ నల్లగుట్టశ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవాలయం ప్రాంగణంలో ఈనెల 24న జరుగనున్న ద్వాదశ జ్యోతిర్లింగ శివపడిపూజ మహోత్సవం వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, శివస్వాములు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ శివపడిపూజ మహోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు

ఆలయ ముఖద్వారానికి భూమిపూజ

దుండిగల్, ఫిబ్రవరి 19: దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప సముదాయం సమీపంలోని నల్లపోచమ్మ, ఉమామహేశ్వరస్వామి దేవాలయం ముఖద్వారం(కమాన్) నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పితాని శ్రీనివాస రావు, ఆలయ పూజారి శ్రీకాంత్‌చారి, నర్మద, స్వర్ణకుమారి, అర్జున్, లక్ష్మణ్, దశరథకుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, భిక్షపతి, రాంచంద్రనాయక్, అమృతయ్య, రమణ, సరిత, లక్ష్మితో పాటు పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ కమాన్ పనులకు భూమిపూజ చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

తెలంగాణలో చోరీ.. బీదర్‌లో విక్రయం

- జీవాలు అపహరిస్తున్న ముఠా అరెస్ట్
- రూ.4.5లక్షలు, వాహనం సీజ్

దుండిగల్, ఫిబ్రవరి 19: గ్రామాలకు దూరంగా ఉండే పశువులు, మేకలు, గొర్రెలను అపహరించి.. సంతలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న దొంగల ముఠాను దుండిగల్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులందరూ బంధువులు.. ఒకే తండాకు చెందిన వారు కావడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చిల్లేపల్లి తండాకు చెందిన రాథోడ్ రాజు(45), రాథోడ్ సీతారాం(26), బానోత్ శివాజీ(50), రాథోడ్ రాజేశ్(50), రాములు మద్యానికి బానిసై.. జల్సాలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో వీరంతా ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారు. ఊరుకు దూరంగా ఉండి, కాపలాదారులులేని పశువులు, మేకలు, గొర్రెల కొట్టాలను ముందుగానే గుర్తించి, రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగిలించిన పశువులను రాథోడ్ సీతారాంకు చెందిన తుఫాన్ వాహనంలో బీదర్‌కు తరలించి సంతల్లో విక్రయిస్తున్నారు. ఇలా 2023 నుంచి ఇప్పటివరకు శంకర్‌పల్లి పీఎస్ పరిధిలో 2, దుండిగల్ పీఎస్ పరిధిలో3, జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 చొప్పున చోరీలకు పాల్పడ్డారు. ఇటీవల దుండిగల్ పీఎస్ పరిధిలోని బొరంపేట్‌లో వరుసగా ఇటువంటి దొంగతనాలు జరుగుతుండటంతో పోలీసులు నిఘా పెంచారు. సోమవారం ఉదయం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బొరంపేట్ సర్వీస్ రోడ్డు గొర్రెల లోడ్‌తో రాథోడ్‌రాజు, సీతారాంకు చెందిన తుఫాన్ వాహనంలో అనుమానాస్పదంగా వెళ్తుండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయం బయటపడింది. రాజు ఇచ్చిన సమాచారంతో రాథోడ్ సీతారాం, బానోత్ శివాజీ, రాథోడ్‌రాజేశ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి రూ.4.50లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రాములు పరారీలో ఉన్నాడు.

గోపన్‌పల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠ

గోపన్‌పల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠలో గ్రామస్తులతో కలిసి పాల్గొన్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 19: గోపన్‌పల్లిలో నాభిశీల (బొడ్రాయి) ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనము, అంకురారోహనం, అగ్నిప్రతిష్ఠ, మండపారాధన పూజ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు మహోత్సవాలు నిర్వహించనున్నారు.

మేయర్‌కు ఆహ్వానం..

దుండిగల్, ఫిబ్రవరి 19: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవ్యాస్ ఆనందంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఅతిథిగా హాజరుకావాలంటూ భవ్యాస్ ఆనందం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

దీనబంధు కాలనీలో ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఫిబ్రవరి 19 : ధైర్య సాహసాలకు ధీరత్వానికి ఛత్రపతి శివాజీ ప్రతీకని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ శివాజీ చూపిన బాటలో నడవాలన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని కూకట్‌పల్లి డివిజన్ దీనబంధు కాలనీలో ఆయన విగ్రహానికి మాజీ కార్పొరేటర్ రంగారావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ సోమవారం పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి మొఘల్‌ను ఎదురించిన ధీరుడన్నారు. దేశ ఖ్యాతిని నలు దిశలా వ్యాపింపజేసిన ఛత్రపతిని చరిత్ర ఎన్నటికీ మరువదని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లం నాయుడు, సుభాష్, బాలు, మహేందర్, రాజు, విజయ్, చిట్టూ, విఠల్, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

మూసాపేటలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నేత గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో పి.పవన్‌కుమార్, యోగేశ్‌ప్రభు, రాజ్‌కుమార్ జాదవ్, సాయిచించోలె, సురేశ్ యాదవ్ తదితరులు

మూసాపేట, ఫిబ్రవరి 19: మూసాపేట డివిజన్ పరిధిలోని ఆంజనేయ నగర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ పాల్గొని ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మనోహర్, జిల్లా అధికార ప్రతినిధి శేఖర్ గుప్తా, వినోద్, సాయి, ప్రశాంత్‌రెడ్డి, ఉమాకాంత్, శ్రీనివాస్, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీ మహారాజ్ జయంతిలో పాల్గొన్న కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్

కేపీహెచ్‌బీ కాలనీలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ప్రభాకర్‌గౌడ్, ఉమాకాంత్, విఠల్ తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

చందానగర్ డివిజన్ పరిధిలోని భవానీపురంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన చందానగర్ డివిజన్ పరిధిలో స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

– కొండాపూర్, ఫిబ్రవరి 19

జేఎన్‌టీయూహెచ్ పరీక్షల విభాగం అధిపతికి శుభాకాంక్షలు

జేఎన్‌టీయూహెచ్ పరీక్షల విభాగ అధిపతిగా (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్) బాధ్యతలు చేపట్టిన ఎం.నాగరత్నకు, వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేట్టిన వి.పద్మావతికి వర్సిటీ విద్యార్థి జేఏసీ సంఘాల నేతలు పుష్పగుచ్ఛాన్ని అందించి.. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు సందీప్, అంబటి తేజ, భాను ప్రకాశ్, సన్ని, ఇమానుయల్, అభినవ్, యువరాజ్, సలీమ్, ప్రజ్వల్, నయాన్ తదితరులున్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 19

ప్రజావాణికి 29 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 19 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 29 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అభిలాష తెలిపారు. మూసాపేట సర్కిల్‌లో 0, కూకట్‌పల్లి సర్కిల్‌లో 1, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 9, గాజులరామారం సర్కిల్‌లో 3, అల్వాల్ సర్కిల్‌లో 4, కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో 12 ఫిర్యాదుల వచ్చాయన్నారు. ఈ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్ నేతల ఒత్తిడితో..

బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించడం బాధాకరం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 19: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను.. అధికార కాంగ్రెస్ పార్టీ నేతల ఒత్తిడితో జీహెచ్ఎంసీ సిబ్బంది రాత్రికి రాత్రే తొలగించడం బాధకరమని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినం ఫ్లెక్సీలను తొలగించడాన్ని నిరసిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గం యువజన, మహిళ, మైనార్టీ, ఎస్సీఎస్టీ, కార్మిక సంఘాల నేతలు కూకట్‌పల్లి జోన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జోనల్ కమిషనర్, సర్కిల్ ఆఫీస్, పోలీస్ స్టేషన్లలో వినతిపత్రాలు అందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నేతలతో కుమ్మక్కై.. ఎమ్మెల్యే కృష్ణారావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, హోర్డింగ్స్‌లను అర్ధరాత్రి దొంగతనంగా, దౌర్జన్యంగా తొలగించారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతల ఫ్లెక్సీలు తొలగించకుండా కేవలం బీఆర్ఎస్ పార్టీకి చెందిని ఫ్లెక్సీలను మాత్రమే తొలగించడం దర్మార్గమైన చర్యయన్నారు. ఈ సంఘటనలో బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు జన్ను సాయి శ్రీనివాస్, బొట్టు విష్ణు, అనితాశ్రీపాల్, ప్రభాకర్‌గౌడ్, వెంకటేశ్, రాజేశ్‌రాయ్, పవన్‌కుమార్, పాతూరి గోపి, నాగరాజు, భవనీ, భారతి, సావిత్రి, కన్నాలత, రమ ఉన్నారు.



కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు

డెకథ్లాన్ ప్లేస్‌మెంట్‌కు విద్యార్థినుల ఎంపిక

ప్రముఖ స్పోర్టింగ్ గూడ్స్ రిటైలర్ డెకథ్లాన్ సోమవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రిషి మహిళా కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. పలు పరీక్షల అనంతరం రిషి మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినులు ఖుషి పాండీ, అనూష, శివ భూమిక, ప్రత్యూష, అనిత చౌదరి ప్లేస్‌మెంట్‌కు ఎంపికయ్యారు. విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ రాజశ్రీ, ప్లేస్‌మెంట్ అధికారిణి లక్ష్మీతులసి, పీడీ జ్యోతి, అధ్యాపకులు అభినందించారు.

– మియాపూర్, ఫిబ్రవరి 19

డివైడర్‌ను ఢీకొట్టిన కారు..ఒకరుమృతి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 19: అతివేగంతో దూసుకొచ్చిన ఊబర్‌కారు రోడ్డు పక్కన ఉన్న డివైడర్ పైకి ఎక్కి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గాజులరామారానికి చెందిన ఎనగందుల యాదగిరి(56)తో పాటు తన భార్య ఉమా, కొడుకు హేమంత్, కోడలు పూజ కలిసి ఆదివారం కొత్తగూడెంలో ఉన్న తన బంధువుల వివాహానికి వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి రైలుమార్గంలో నగరానికి వచ్చి తమ ఇంటికి వెళ్లేందుకు ఊబర్‌కారు బుక్ చేసుకున్నారు. కారులో ఇంటికి చేరుకుంటుండగా మార్గమధ్యలో సోమవారం గాజులరామారం ఉషాముళ్లపుడి ఆస్పత్రి వద్ద టర్నింగ్ పాయింట్‌లో అతివేగంతో దూసుకొచ్చి డివైడర్ ఎక్కడంతో ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌తో పాటు భార్య, కొడుకు, కోడలుకు స్వల్పగాయలయ్యాయి. మృతుడి చిన్న కొడుకు ప్రణయ్‌చంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 19 : క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ బాల్ బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. రాష్ట్రంలోని 14 జట్లు పోటీల్లో పాల్గొనగా సౌత్ సెంట్రల్ టీమ్ మొదటి స్థానంలో, ఏకశిల వరంగల్ టీమ్ రెండో స్థానంలో, కేపీహెచ్‌బీ కాలనీ టీమ్ మూడో స్థానంలో, వరంగల్ అసోసియేషన్ టీమ్ నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ వేడుకలు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, మాజీ కార్పొరేటర్ పన్నాల కావ్యారెడ్డి హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాలనీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జె.ఎస్.నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణా రావు, కార్యదర్శి రవీందర్‌గౌడ్, కోశాధికారి తాండవకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

**IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT : ZAHEERABAD